క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు స్వాగతం


స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ, డీఎస్పీ

గూడూరు: భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆదివారం ఘనస్వాగతం పలికారు. నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం చెన్నై నుంచి గూడూరుకు రైల్లో వచ్చిన ఆయనకు రైల్వేస్టేషన్‌లో వెంకయ్యకు ఆర్డీఓ, డీఎస్పీలు పుష్పగుచ్ఛంతో శాలువా కప్పి, పుస్తకాలను అందజేశారు. వారి వెంట రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

మండల మీట్ రేపు

చిట్టమూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు 13 అంశాలపై సమీక్షిస్తారని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎంపిక

వెంకటగిరి: ఏఐటీయూసీ వెంకటగిరి శాఖ నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం స్థానిక కాశీపేట సామాజిక హక్కుల వేదిక భవనంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షతన నిర్వహించారు. కమిటీ నూతన గౌరవ అధ్యక్షుడిగా వడ్డిపల్లి చెంగయ్య, అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, కార్యదర్శిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గోపాల్, మణి, శ్రీనివాసులు, లక్ష్మి, రమణయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

పెళ్లకూరు: మండల పరిధిలోని రోసనూరు గ్రామం శివారు ప్రాంతంలో పేకాట స్థావరాలపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రోసనూరు అటవీ ప్రాంతంలో జరుగుతున్న పేకాట స్థావరాలపై పోలీసులు చేపట్టిన దాడుల్లో నలుగురు జూదరులు రూ.4,540 నగదు పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష


తడ: ఇళ్లకు తాళాలు వేసుకుని ఊర్లకు వెళ్లే వారు స్థానిక సచివాలయ పోలీసులకు తెలపాలని ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు లేకుండా జాగ్రత్త పడేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పండుగల పేరుతో గ్రామాల్లో కోడిపందేలు, పేకాటలు, రికార్డింగ్ డ్యాన్సులు వంటి అసాంఘిక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారం దిశగా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: మండల పరిధిలోని ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని ఎంపీపీ గద్దం అరుణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన పనులు, జరిగిన అభివృద్ధి పనుల గురించి శాఖల వారీగా ఆయా శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత గ్రామ వలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రవీంద్రరాజు, ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దార్ లాజర్స్, పలు శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయింపు


ఏకొల్లు గ్రామ పరిధిలో శ్మశానం కోసం సర్వే చేస్తున్న అధికారులు

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామ పరిధిలోని ఎస్సీలకు శ్మశానస్థలం కోసం స్థానిక రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేపట్టారు. సర్వే 51–1లో ప్రభుత్వం గుర్తించి సర్వే చేసి ఎకరా స్థలం శ్మశానానికి కేటాయించి హద్దు రాళ్లు నాటారు. స్థానికంగా ఎస్సీలకు శ్మశానం లేనందున పలు ఇబ్బందులు పడ్డారు. శ్మశానానికి భూమి కేటాయించే విషయంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి సహకరించినందుకు స్థానిక సర్పంచ్ ఆవల బ్లెస్సీ కృతజ్ఞతలు తెలిపారు. మండల సర్వేయరు రామారావు, ఆర్ఐ స్వర్ణలత, వీఆర్వో స్పందన పాల్గొన్నారు.

సంక్షేమంలో వైఎస్సార్‌సీపీది ఓ చరిత్ర

- ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తి
- నాడు ప్రజల సమస్యలను కళ్లారా చూసిన జగనన్న
- పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన
- ఎమ్మెల్యే వరప్రసాదరావు


గూడూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు


దక్కిలిలో..


సైదాపురంలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు


బాలాయపల్లిలో ..


వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


చిల్లకూరులో..


రాపూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నాయుడుపేటలో..


వాకాడులో..

గూడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ద్వారానే ప్రజల కష్టనష్టాలను కళ్లారా చూసి, వారికి నేను విన్నాను.. నేను ఉన్నాను అని భరోసా కల్పించారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి, శాంతినగర్ కూడలి ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎవరూ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,648 కి.మీ పాదయాత్ర చేపట్టి, ఆయన సీఎం అయ్యాక, ఇచ్చిన ప్రతి హామీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, మీరారెడ్డి, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ అబ్దుల్ గఫూర్ బట్టా గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: పేదల సంక్షేమం అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పోట్లేళ్ల శిరీష తెలిపారు. మండల కేంద్రం సైదాపురంలో సోమవారం తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజా సంకల్పయాత్ర పూర్తిచేసి నాలు గేళ్ల అయిన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ముందుగా బస్టాండ్‌లో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, సైదాపురం సర్పంచ్ శారద, అనంతమడుగు ఎంపీటీసీ వెంకటరమణయ్య, ఉపసర్పంచ్ శివ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఎక్కువ పథకాలు అమలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ప్రజాసంకల్పయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల కంటే ఎక్కువే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లిలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు బ్రెడ్‌లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలోని ఆదర్శ సీఎం జగనన్న

దక్కిలి: దేశంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఆల్తూరుపాడు సొసైటీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రజాసంకల్పయాత్ర చిరస్మరణీయ ఘట్టమని పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, నెల్లూరు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, సీనియర్ నాయకులు చెలికం శంకర రెడ్డి, చిట్టేటి హరికృష్ణ తెలియజేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, త్రిభువని సెంటర్లోల దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: మండలకేంద్రంలోని స్థానిక గ్రంథాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం, కేక్ కట్ చేసి చేశారు. మాజీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా ఇవే కార్యక్రమాలు నిర్వహించారు. కంబాలపల్లి సచివాలయంలో నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేశచరిత్రలో ఓ అపూర్వ ఘట్టం

నాయుడుపేటటౌన్: ప్రజాసంకల్ప పాదయాత్ర దేశ చరిత్రలో ఓ అపూర్వ ఘట్టమని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. సోమవారం నాయుడుపేట పాత బస్టాండులోని దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: ప్రజాసంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లు అయిన సందర్భంగా వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలోని దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి జెడ్పీటీసీ మన్నెం శీనయ్య పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామ రెడ్డి, నాయకులు జయరాం పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

నాయుడుపేటటౌన్: సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నాయుడుపేట డివిజన్ పరిధిలో ఎక్కడైనా గ్రామాల్లో కోడిపందేలు, సింగిల్ నంబర్ల ఆటలు, పేకాట తదితర జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి హెచ్చరికలు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం సీఐ సీహెచ్ ప్రభాకర్ రావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో నాయుడుపేట, సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, తడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సీఐలతో పాటు ఎస్ఐలు ఐడీ పార్టీ పోలీసులతో నిఘా చర్యలు చేపట్టి ఉన్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో ఎక్కడైనా కోడిపందేలు జరుపుతున్నట్లు తెలిస్తే 94910 86024 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా పండుగ సెలవులకు ఇళ్లు, పలు పరిశ్రమలకు తాళాలు వేసుకుని వెళ్లే వారు కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముందస్తుగా పోలీసులకు సమాచారం అందిస్తే వారి ఇళ్ల వద్ద పోలీసు నిఘా ఉంచుతామన్నారు.

కోడి పందేలు చట్టవిరుద్ధం

దొరవారిసత్రం: మండల పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు ఆడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ తిరుమలరావు సోమవారం తెలిపారు. అదేవిధంగా జూదం, అశ్లీల నృత్యాలు వంటి జరిగినా, ఇలాంటి వాటిని ఎవరైనా ప్రోత్సహిస్తే కూడా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తహసీల్దార్‌కు వినతి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

సైదాపురం: మండలంలోని మొలకలపూండ్ల చెరువు కింద ఉన్న 20 ఎకరాల్లో వరినాట్లు నీట మునిగాయని గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం జరిగిన స్పందనలో విన్నవించారు. వారు మాట్లాడుతూ చెరువుకు సమీపంలో ఉన్న రా మసాగరం చెరువు కలుజు ఎత్తు పెంచడంతో గత కొద్దిరోజుల నుంచి నీరు మాగాణిలోనే నిలిచి ఉందన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామంటూ తహసీల్దార్‌కు తమ గోడు విన్నవించుకున్నారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి


దగ్గవోలు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

దక్కిలి: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి బోధన అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని దగ్గవోలు ఈస్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నాడు–నేడు కింద విద్యార్థులకు అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని, హైస్కూల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కలిగిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


బహుమతులు అందిస్తున్న ఆర్‌బీఐ డీఎల్ఓ సుభాష్

వెంకటగిరిరూరల్: మహిళల అభివృద్ధే లక్ష్యంగా ఆర్థికంగా లాభాలబాట వైపు పయనించాలని ఆర్‌బీఐ డీఎల్ఓ సుభాష్ తెలిపారు. మండలంలోని జంగాలపల్లిలో సోమవారం పొదుపు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఆన్‌లైన్ పేమెంట్ బ్యాంకు చార్జీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు పలు రకాలు రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే తమకు సంబంధించి ఓటీపీలను చెప్పొద్దని వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం పూర్ణిమ, ఎంపీడీఓ కోటీశ్వరరావు, ఏపీఎం జమున, సీఎల్ఎఫ్ సోము, సీసీ వెంకటేశ్వర్లు, వీఏఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన


ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: ప్రజల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అందుకే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట మండల పరిధిలోని గోపాల్‌రెడ్డిపాలెం గ్రామంలో సోమవారం ఆయన గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో రూ.4.80 కోట్ల వరకు సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. దీంతో పాటు సుమారు రూ.1.40 కోట్లతో పంచాయతీలో సీసీ రోడ్లుతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణ చూసి పని గట్టుకుని ఇతర పార్టీ నాయకులు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తునట్లు ఆరోపించారు. సుమారు 400 గడపలను ఆయన సందర్శించారు. మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతునట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి నివేదికలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు పరిష్కారం చూపండి


స్పందనలో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఆర్డీఓ మురళీకృష్ణ

కోట: స్పందనలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కోట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో గూడూరు ఆర్డీఓ మురళీకృష్ణతో కలసి పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 65 మంది అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులు వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికార యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా పని చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ధనుంజయరెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తాం

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి అన్నారు. సోమవారం ఆయన ఆర్డీఓ మురళీకృష్ణతో కలిసి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సాయిప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ నారాయణరావు పాల్గొన్నారు.

మన సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు


ఫల సరుకులను అందజేస్తున్న గోపాల్‌రెడ్డి


గూడూరు: మన సంస్కృతితో పాటు సంప్రదాయాలకు ప్రతీకలు రంగవల్లులు అని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన యువతకు మన సంస్కృతితో పాటు, అనాదిగా వస్తున్న సంప్రదాయలను నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భవిష్యత్ తరాలకు మన సంప్రదాయాలను గుర్తు చేసినట్లు అవుతుందన్నారు. ఈ ముగ్గుల పోటీల్లో విజేతలకు క్లబ్ అధ్యక్షుడు దువ్వూరు రవీంద్రరెడ్డి రూ.10 వేలు విలువ చేసే గృహోపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయన గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫల సరుకులను స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, వాసుగౌడ్, రాఘవరెడ్డి, సబ్రమణ్యం, బలరామిరెడ్డి పాల్గొన్నారు.

హెలీప్యాడ్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిల్లకూరు: జిందాల్ యాజమాన్యం తమ అవసరాల నిమిత్తం హెలీప్యాడ్ నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. దీంతో సోమవారం తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయతీ పరిధిలోని పరిశ్రమలో హెలీప్యాడ్ నిర్మించేందుకు అనువైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణ మాట్లాడుతూ తమ్మినపట్నం ప్రాంతంలో గతంలో ఉన్న సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ జిందాల్ యాజమాన్యం చేతుల్లోకి మారిందన్నారు. వీరికి ఈ ప్రాంతంలో అవసరాల నిమిత్తం హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడంతో వారి పరిశ్రమ ఆవరణలోనే హెలీప్యాడ్ నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఇందుకు సంబంధించి సర్వే పూర్తి చేసి వారికి సలహాలు ఇచ్చామన్నారు. ఆర్ఐ చైతన్య, సర్వేయర్ మల్లికార్జున, పరిశ్రమ ప్రతినిధులు ఉన్నారు.

జేవీవీ సేవలు అభినందనీయం


గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న పేర్నాటి, కిషోర్‌రెడ్డి

గూడూరు: సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను పారదోలడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రికి వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ మూలి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పేర్నాటి మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా మంచి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారావు, జేవీవీ నాయకులు రాజేంద్రప్రసాద్, పురుషోత్తమ రావు, రామ్మోహన్‌రావు, చెంచునారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు షీల్డులను అందజేస్తున్న సంస్థ సభ్యులు

గూడూరు: ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ టోర్నీ విజేతలకు షీల్డులు, బహుమతులను సంస్థ ప్రతినిధులు ఆదివారం రాత్రి అందజేశారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో విజేతగా నిలిచిన దీపు, విష్ణు, రన్నర్స్‌గా నిలిచిన రమేష్, చంద్రతోపాటు తృతీయస్థానంలో నిలిచిన రాజా, సంవిత్‌కు షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు నాగేంద్రరెడ్డి, శ్రీహరి, కలాం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ..

వివిధ కేటగిరీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎం.సురేష్‌రెడ్డి దాతృత్వంతో సోమవారం 16 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.